వార్ వన్‌సైడ్.. డిసైడ్

మాజీ ఎమ్మెల్యే విష్ణు వైఎస్సార్‌సీపీలో చేరికతో మరింతగా పెరిగిన గ్రాఫ్

సార్వత్రిక ఎన్నికల్లో కావలిలో వార్ వన్ సైడ్ అనేది డిసైడ్ అయిపోయింది. ఇప్పటికే కావలిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి హ్యాట్రిక్ విజయం ఖాయం కాగా, మెజార్టీపైనే రాజకీయ పార్టీల్లో అంచనాలు చక్కర్లు కొడుతున్నాయి. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అప్రతిహతంగా గెలుపు మెజార్టీలను చేజిక్కించుకుంటూ వచ్చారు. గత ఎన్నికల్లో ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ప్రత్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరడంతో ఆ పార్టీ గ్రాఫ్ మరింతగా పెరిగింది. అల్లూరుకు చెందిన ఇద్దరు బలమైన నేతలు రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నెల్లూరు ఎంపీ ఆదాలతో పాటు విష్ణువర్ధన్‌రెడ్డి తోడు కావడం, సంక్షేమం, అభివృద్ధి పథకాలతో జనమంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉండడంతో ఈ దఫా వార్ వన్ సైడ్ అనేది స్పష్టంగా కనిపిస్తోంది.

- ఇప్పటికే వైఎస్సార్‌సీపీకి రాజ్యసభ సభ్యుడు బీద, ఎంపీ ఆదాల బలం
- గతంలో కన్నా భారీగా మెజారిటీ వచ్చే అవకాశం
- సంక్షేమ, అభివృద్ధి పథకాలతో జనమంతా పార్టీ వెంటే

కావలి: కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గత రెండు ఎన్నికల్లోనూ అధికార, ప్రత్యర్థి పార్టీల కుట్రలు, కుతంత్రాలు, అక్రమ కేసులు, వేధింపులు తట్టుకుని ఎన్నికల్లో విజయం సాధించారు. గత రెండు దఫాలుగా మెజార్టీ పెంచుకుంటూ వస్తున్న ప్రతాప్‌కుమార్ రెడ్డికి ఈ దఫా మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడడంతో కావలి చరిత్రలో నిలిచిపోయే మెజార్టీ వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. గడిచిన ఐదేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పార్టీ గ్రాఫ్ భారీగా పెరగగా, రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్ సాధనతో వ్యక్తిగతంగా ప్రజల్లో ప్రతాప్‌కుమార్‌రెడ్డి గ్రాఫ్ కూడా పెరిగింది.

ఎన్నిక.. ఎన్నికకు పెరిగిన మెజార్టీలు

2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, టీడీపీ తరఫున బీద మస్తాన్‌రావుతో పోటీపడగా 4,969 ఓట్ల ఆధిక్యం (2.71 శాతం)తో విజయం సాధించారు.

- 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కుట్రలు, కుతంత్రాలు, బెదిరింపులు, అక్రమ కేసులు తట్టుకుని 2019 ఎన్నికల్లో రెండో సారి కూడా ప్రతాప్‌కుమార్‌రెడ్డి గతం కంటే మూడింతల అదనపు మెజార్టీ తో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో దిగిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డిపై 14,117 ఓట్ల (7.24 శాతం) ఆధిక్యంతో రెండో సారి కూడా ఘన విజయం సాధించారు. గత ఎన్నికల్లో ప్రతాప్ కుమార్‌రెడ్డికి ప్రత్యర్థులుగా నిలిచిన ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కూడా ఈ దఫా ఒకే పార్టీలో ఉండడంతో మెజార్టీ భారీగా పెరగడం ఖాయమని అందరూ భావిస్తున్నారు.



కావలిలో ఇద్దరూ కలిసి భారీ మెజార్టీ తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డికి సూచిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

భారీ మెజార్టీతో హ్యాట్రిక్ ఖాయం

2014, 2019 ఎన్నికల్లో వరుసగా మెజార్టీ పెంచుకుంటూ వస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి 2024 ఎన్నికల్లో భారీ మెజారిటీతో హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని విశ్లేషకులు చెబుతున్నారు. నియోజకవర్గ ఓటర్ల రుణం తీర్చుకునే దిశగా బృహత్తర ప్రణాళికను అమలు చేశారు. నియోజకవర్గాన్ని ప్రగతి పథంలోకి తీసుకువెళ్లే రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సాధించడంతో పాటు పారిశ్రామిక కారిడార్‌గా మర్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం జగనన్న మెగా లేఅవుట్ల పేరుతో ఊర్లకు ఊర్లే సృష్టించారు. గడిచిన ఐదేళ్లలో సుమారు రూ.14 వందల కోట్ల మేర సంక్షేమ పథకాల రూపంలో పేదలకు అందించే అవకాశం కల్పించారు. దీంతో ఓటర్లంతా ఈ దఫా కూడా రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి వైపే నిలబడుతున్నారు. ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సానుకూల పవనాలు వీస్తుండడం, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రాఫ్ భారీగా పెరగడం, ప్రతాప్‌కుమార్‌రెడ్డికి స్థానికంగా సొంత క్యాడర్ పెరగడం, బీద మస్తాన్‌రావు, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మద్దతుతో ఈ దఫా 50 వేల నుంచి 60 వేల పైచిలుకు మెజార్టీలు వస్తాయని టీడీపీ వర్గాలే బెట్టింగ్‌లకు సిద్ధం అంటుండడం గమనార్హం.

క్లుప్తంగా

ప్రజాగళం సభ వెలవెల



సభలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సోమశిల: అనంతసాగరంలో టీడీపీ ఆదివారం నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభ వెలవెలబోయింది. ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖరరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు నేతృత్వంలో అనంతసాగరంలో తొలుత ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. పార్టీ కార్యక్రమానికి జనాన్ని డబ్బులిచ్చి తరలించారు. బహిరంగ సభ ప్రారంభమైన పది నిమిషాలకే జనం ఒక్కొక్కరుగా సభలో నుంచి వదలి వెళ్లిపోయారు. అభ్యర్థి మాట్లాడే సమయానికి సభలో సగానికి పైగా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అధిక భాగం మంది ప్రజలు సభ మధ్యలోనే వెళ్లిపోవడం కనిపించింది.


మేతకు వెళ్లిన మేకలు మృతి



మృతి చెందిన మేకలు

సోమశిల: అనంతసాగరం మండలం బొమ్మవరం మజరా గోగులపల్లిలో ఆదివారం పది మేకలు మృతి చెందాయి. బాధితుడు బద్దల మల్లికార్జున తన మేకలను గోగులపల్లి సమీపంలోని చెరువులో రోజు మేతకు తీసుకెళ్లాడు. ఆదివారం అకస్మాత్తుగా 10 మేకలు మృతి చెందాయన్నారు. ఈ విషయమై పశు వైద్యాధికారులకు సమాచారమిచ్చామని తెలిపారు. మేకలు మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. పది మేకలు మృతి చెందడంతో రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందజేయాలని కోరారు.

సంగంలో విదేశీయుడి బైక్ రైడింగ్



సంగంలో విదేశీయుడు ఫో

సంగం: సంగంలో ఇంగ్లాండ్ దేశీయుడు బైక్ రైడింగ్‌తో సందడి చేశారు. ఇంగ్లాండ్ నుంచి చెన్నైకు చేరుకున్న ఫో అనే యాత్రికుడు ఆదివారం సంగం చేరుకున్నాడు. అతను మాట్లాడుతూ బుల్లెట్ బైక్ మీద ఉన్న ఇష్టంతో బైక్ రైడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. 11 దేశాలు, 18 వేల కిలో మీటర్లు నాలుగు నెల్లల్లో పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇండియా, ఇంగ్లాండ్ కలిసి మెలిసి ఉండాలన్నారు. తాను ఒక ఆర్కిటెక్చర్ అని, ప్రధానంగా బైక్ రైడింగ్ సమయంలో పలు చరిత్రాత్మిక కట్టడాలు, ఆలయాలను సందర్శించి వాటి ప్రాముఖ్యతను తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

నేడు సిద్ధనకొండూరులో విజయ సంకల్పయాత్ర

కలిగిరి: మండలంలోని సిద్ధనకొండూరు, కృష్ణారెడ్డిపాళెం, కుడుములపాడు, నరసారెడ్డిపాళెం గ్రామాల్లో ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విజయ సంకల్పయాత్ర నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ పాలూరి మాల్యాద్రి రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

ఉదయగిరి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని దిలావర్‌భాయి వెల్ఫేర్ అండ్ రిలీఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేద కుటుంబాలకు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఆర్గనైజేషన్ దిలావర్ భాయి వీధిలో కూలి పనులు, చేతివృత్తులు, చిరుద్యోగులైన 30 కుటుంబాలకు రూ.1500 నుంచి రూ.3 వేల వరకు ఆర్థిక సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రఫి, ముక్తియార్, మసూద్, నస్రుల్లా, దావూద్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుడికి విక్రమ్‌రెడ్డి పరామర్శ



కరటంపాడు ఎంపీటీసీ సభ్యులు ఖాసీంసాను పరామర్శిస్తున్న విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు ఎంపీటీసీ సభ్యుడు ఖాసీంసా ఇటీవల కాలు సమస్యతో ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్ రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్న లక్ష్మీ, మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, సొసైటీ అధ్యక్షుడు సానా వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు సూరం ప్రసాద్ రెడ్డి, మాలేపాటి సతీష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రావూరు శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

సంక్షేమ పాలనను గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మర్రిపాడు: నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మళ్లీ మేకపాటి విక్రమ్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం మండలంలోని కేతిగుంట, పల్లిపాడు గ్రామాల్లో నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఆయన సారథ్యంలో ఎంపీ, ఎమ్మెల్యేలుగా నిలుస్తున్న విజయసాయిరెడ్డి, విక్రమ్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, రేవూరు వేణుగోపాల్‌రెడ్డి, రఘురాం, చంద్రా నారాయణస్వామి, రవీంద్రబాబు, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించండి



బీసీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

ఉదయగిరి: పేద ప్రజలకు అన్ని రకాల సంక్షేమం అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని పార్టీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం సాయంత్రం దుత్తలూరు బీసీకాలనీ, పూసల కాలనీ, ఏసీ కాలనీల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు వివరించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. తమకు ఇంత మేలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని కాదని మరొకరికి ఓటు వేయబోమని ప్రజలు స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ రాజకీయంలో అనుభవం కంటే విశ్వసనీయత చాలా గొప్పదని, అలాంటి విశ్వసనీయత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి విపరీతంగా ఉందన్నారు. నలభై ఏళ్ల అనుభవం అని చెప్పుకునే చంద్రబాబుకు కనీస విశ్వసనీయత ప్రజల్లో లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని ఫ్యాను గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, నాయకులు కండ్లగుంట వెంకటరెడ్డి, కంభం మురళీమోహన్‌రెడ్డి, దొంతిరెడ్డి నరసింహారెడ్డి, పల్లా రత్తయ్య, కండ్లగుంట కృష్ణారెడ్డి, మస్తాన్, రంగయ్యనాయుడు, దొంతిరెడ్డి ఓబుల్ రెడ్డి, సింగవరపు విజయ్, గొల్లపల్లి దిలీప్, చిన్నకదిరయ్య, ఉప్పలపాటి రమణారెడ్డి, దేవరపాటి సురేంద్ర, అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చుండి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ గ్రాండ్ ఒలింపియాడ్‌లో ప్రతిభ

- ఆత్మకూరు విద్యార్థులకు స్టేట్ ర్యాంక్



ఐఐటీ గ్రాండ్ ఒలింపియాడ్‌లో స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఈ అభ్యాస్ అకాడమీ సీఈఓ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఐఐటీ గ్రాండ్ ఒలంపియాడ్‌లో ఆత్మకూరు ప్రగతి ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఆయా తరగతుల్లో మొదటి, రెండు, మూడో ర్యాంకులు సాధించారు. గుంటూరులో 10వ ఈ అభ్యాసోత్సవ్ కార్యక్రమం వెంకటేశ్వర ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఒలింపియాడ్ నిర్వాహకులు షీల్డ్, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆత్మకూరు ప్రగతి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి వి జగన్ రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంకును, 8వ తరగతి విద్యార్థినీ ఎస్ శ్రావ్య ఫస్ట్ ర్యాంకును, 7వ తరగతి విద్యార్థి కె అజయ్ ద్వితీయ ర్యాంకును, 6వ తరగతి విద్యార్థినీ ఎ ఉషా రాష్ట్ర స్థాయిలో తృతీయ ర్యాంకును సాధించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్ రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ అమరావతి పాల్గొన్నారు.

నేడు ఉగాది సంబరాలు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణానికి చెందిన తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం క్రోధి నామ ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మేధా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని ముందు రోజు సంబరాలు నిర్వహిస్తున్నట్లు, ఉగాది విశిష్టతను తెలియజేయడంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఏడాదిలో అభివృద్ధి పనులన్నీ పూర్తి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఎన్నికలు ముగిసిన ఏడాది కాలంలోనే కావలి నియోజకవర్గంలో ముఖ్యమైన అభివృద్ధి పనులన్నీ పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కావలిలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కావలి ప్రజలు కలలు కన్న రామాయపట్నం పోర్టును వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసి, నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నారన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తి చేసి మత్స్యకారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపారన్నారు. తిరిగి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలికి వచ్చి వీటిని ప్రజలకు అంకితం చేస్తారన్నారు. కావలిలో పరిశ్రమలు ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ పూర్తి కావచ్చిందన్నారు. పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించి పరిశ్రమలు శరవేగంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. దామవరంలో విమానాశ్రయం నిర్మాణ పనులు మొదలవుతాయన్నారు. టీడీపీ దుష్టరాజకీయానికి బలైపోయిన, తమను ప్రజల్లో అప్రతిష్ట పాల్జేయడానికి పనులు జరగకుండా కాంట్రాక్టర్ ద్వారా చేసిన కుట్రలను చేధించి తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ పనులు చేపడుతామన్నారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దామవరం విమానాశ్రయం, కావలిలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణాలకు శంకుస్థాపనలు మాత్రమే చేసి ప్రజలను మోసం చేసిన చరిత్ర టీడీపీ నాయకులదన్నారు. తుమ్మలపెంట రోడ్డులో అక్రమంగా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

మెటల్‌ను భారీ లోడుతో రవాణా చేసిన టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి వల్లనే ఆ రోడ్డు ఇంత దారుణంగా ధ్వంసమైందన్నారు. తుమ్మలపెంట రోడ్డు, పెద్దపవని రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి, ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులు అన్నీ కూడా ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు.

జగన్ పాలనలో ఒక్క ఎకరా ఎండనివ్వలేదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కావలి నియోజకవర్గంలో ఒక్క ఎకరా పంట కూడా ఎండనివ్వలేదని, సోమశిల ప్రాజెక్టులో నీరు చాలా తక్కువగా ఉన్నప్పటికీ ఇరిగేషన్ అధికారుల సహకారంతో రైతులను ఆదుకున్నామన్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు.

పెల్లుబికిన అభిమానం

కావలిలో మేమంతా సిద్ధం సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో కనీవినీ ఎరుగని రీతిలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యారని ఎమ్మెల్యే చెప్పారు. అంచనాలకు మించి జనం హాజరు కావడంతో వేదిక ప్రాంగణం సరిపోక బయటకూడా నిలబడిపోయారన్నారు. మేమంతా సిద్ధం సభను విజయవంతం చేసిన ప్రజలకు ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారన్నారు. పార్టీ నాయకులు కలిసి కట్టుగా పని చేసి మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలన్నారు. చంద్రబాబు కావలికి వస్తే, ప్రజలు రాకపోవడంతో పరిస్థితి ఎలా ఉండిందో అందరికీ తెలిసిందన్నారు. అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలికి వస్తే ఒకటిన్నర లక్షకు పైగా ప్రజలు తరలి వచ్చి ఆశీర్వదించారని చెప్పారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మేకపాటి



కరటంపాడు మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు మసీదు ఆష్టాలో ఆదివారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత ప్రత్యేక దువా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిట్టమూరు జితేంద్ర నాగ్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, ఖాసీంఖాన్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రచారం

ఆత్మకూరు: ఆత్మకూరులోని 6వ వార్డులో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ఇంటింటికి తిరిగి ప్రచారం చేయనున్నట్లు పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పని సరిగా పాల్గొనాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లిలో ఆదివారం మానస క్లినిక్ వైద్యులు సోము సుబ్రహ్మణ్యం ఉచిత న్యూరో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నెల్లూరు యామిని న్యూరో కేర్ డాక్టర్ అద్దేపల్లి యామిని రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. 113 మంది రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ల్యాబ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వైఎస్సార్‌సీపీ మేలు



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనుమసముద్రంపేట: ప్రతి ఇంటికి మేలు చేసిన పార్టీ వైఎస్సార్‌సీపీ, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిలను గెలిపించాలంటూ ఆ పార్టీ నేతలు ముమ్మరంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని హసనాపురంలో ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పులిమి వెంకట రమేష్‌రెడ్డి, రాజవోలు సొసైటీ చైర్మన్ కల్లూరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న పదేళ్ల కాలంలో అందజేసిన సంక్షేమాన్ని వివరించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూరా శ్రీనివాసులరెడ్డి, బోయళ్ల చెంచురెడ్డి, వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, కృష్ణమనాయుడు, సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, గుంపర్లపాడు సర్పంచ్ వనిపెంట రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆత్మకూరు: జనవిజ్ఞాన వేదిక, డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం సహకారంతో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. షిరిడీ సాయిరామ్ కళాశాలలో నిర్వహించిన ఈ శిబిరం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సాగింది. ప్రతి రెండు నెలలకొకసారి జేవీవీ ఆధ్వర్యంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు అతి తక్కువ ధరకు పరీక్షలు నిర్వహించడం, రెండు నెలలకు సరిపడా మందులు కేవలం రూ.200 ఇవ్వడం ఈ శిబిరం ప్రత్యేకత. నెల్లూరుకు చెందిన డాక్టర్ రమణయ్య నేతృత్వంలో పలువురు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, షేక్ సందానీ, జేవీవీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు